# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు జాతినుద్దేశించి ప్రసంగిస్తారు.**
2. **రాష్ట్ర ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు.**
3. **స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి.**
4. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఐటీ-ఎలక్ట్రానిక్స్ , ఆర్టీజీ శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
5. **రాష్ట్రంలో నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణను సెప్టెంబరుకు వాయిదా వేసినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.**

==========================

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఈరోజు సాయంత్రం 7 గంటలకు దేశంలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలు మొదట హిందీలోనూ, అనంతరం ఆంగ్లంలోనూ ప్రసంగాన్ని ప్రసారం చేస్తాయి. దూరదర్శన్‌లో హిందీ, ఆంగ్లం ప్రసంగం తర్వాత స్థానిక కేంద్రాలు ప్రాంతీయ భాషల్లో రాష్ట్రపతి ప్రసంగాన్ని ప్రసారం చేస్తాయి. ప్రాంతీయ ఆకాశవాణి కేంద్రాలు రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ప్రాంతీయ భాషల్లో రాష్ట్రపతి అనువాద ప్రసంగాన్ని ప్రసారం చేస్తాయి.

-------------------------

రాష్ట్ర ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులందరిని స్మరించుకోవాలన్నారు. సత్యం, అహింస, శాంతి, ఐకమత్యం మరియు సర్వ మానవ సౌభ్రాతృత్వంతో విలసిల్లుతూ, ఉత్తేజంగా దేశ ప్రజలంతా పునరంకితం కావాలన్నారు. 2047 సంవత్సరంలో దేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరిగేనాటికి, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే దిశగా, వికసిత్ భారత్ స్ఫూర్తితో అడుగులు వేస్తూ, దేశ నిర్మాణానికి అందరం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

-------------------------

ఢిల్లీలోని ఎర్రకోటలో రేపు 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఎర్రకోట నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ వేడుకలకు దేశవ్యాప్తంగా ఉన్న పంచాయతీరాజ్ సంస్థల నుంచి ఎన్నికైన మహిళ ప్రతినిధులతో సహా 400 మంది ప్రతినిధులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. కాగా ఈ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఏలూరు జిల్లా కొయ్యలగూడేనికి చెందిన రైతు దంపతులు పి. నాగమణి, పోతురాజుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల కోటాలో వారికి ఆహ్వానం అందినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ జెండాను సామాజిక మాధ్యమాల పేజీల్లో ప్రొఫైల్ చిత్రంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటింటా జాతీయ జెండా విస్తృత కార్యక్రమంగా మారడం ఆనందంగా ఉందని సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు. తెలుగు వారైన పింగళి వెంకయ్య రూపొందించిన జెండా ప్రతీ ఇంటిపై ఎగరడం తెలుగువారికి మరింత గర్వంగా ఉంటుందని పేర్కొన్నారు.

..వాయిస్..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విజయవాడలోని ఆమె స్వగృహంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రతీ ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ స్ఫూర్తిని చాటాలని తెలిపారు.

తిరుపతిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. చిత్తూరు జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేపు చిత్తూరులో జరిగే జిల్లా స్థాయి వేడుకలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పాల్గొంటారని తెలిపారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఐటీ-ఎలక్ట్రానిక్స్ , ఆర్టీజీ శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షలో కొత్త ఐటీ విధాన రూపకల్పన, విశాఖపట్నం కేంద్రంగా ఐటీ పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలపై చర్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇలా ఉండగా ఓడ రేవులు, పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపై నిన్న రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 100 ఎకరాల చొప్పున మొత్తం 100 పారిశ్రామిక వాడల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో రాష్ట్రంలో సమీకృత ఓడరేవుల అభివృద్ధికి తగిన బృహత్ ప్రణాళిక తయారు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో రేపు జరిగే రాష్ట్ర స్థాయి 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని రాష్ట్ర డీజీపీ సీహెచ్

ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ ఇతర అధికారులతో కలిసి మున్సిపల్ మైదానంలో నిన్న నిర్వహించిన సన్నాహక ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. స్వాతంత్ర్య వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీజీపీ దిశానిర్దేశం చేశారు. మరోవైపు రేపు కాకినాడలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పాల్గొననుండగా, ఆయా జిల్లాల్లో జరిగే జిల్లాస్థాయి వేడుకల్లో రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు.

---------------------------

ఉద్యోగుల బదిలీల దృష్ట్యా రాష్ట్రంలో నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణను సెప్టెంబరు తొలి వారానికి వాయిదా వేసినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన మాట్లాడుతూ, సదస్సుల నిర్వహణకు వీలుగా ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్‌ను నోడల్ అధికారిగా నియమిస్తామని తెలిపారు. అన్ని రకాల భూ వివాదాలపైనే కాకుండా.. రీ సర్వే ద్వారా రైతులకు ఎదురైన సమస్యలపై కూడా సదస్సుల్లో ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. సదస్సులు ప్రారంభమైన తొలి 45 రోజులు ఫిర్యాదులు స్వీకరించి, మరో 45 రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్రీహోల్డ్ ఎసైన్డ్‌మెంట్ రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై తాత్కాలికంగా విధించిన మూడు నెలల గడువును మరో 15 రోజులకు పెంచుతామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఆరోగ్య బీమా ఉన్న వారికి వైద్యం అందించే అంశాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో నిన్న ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల ప్రధానోపాధ్యాయులు, సూపరింటెండెంట్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బోధనాస్పత్రుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పన పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అరగంటలో రోగుల ఓపీ నమోదు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొంటూ,

..వాయిస్ ..

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కాగిత రహితంగా రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మంత్రులకు ఐప్యాడ్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై మంత్రి వర్గ సమావేశాలు ఎలక్ట్రానిక్ విధానంలోనే జరుగుతాయని అధికారులు తెలిపారు. అజెండా అంశాల ఆధారంగా ప్రతి సమావేశానికి ప్రభుత్వం 40 సెట్ల పత్రాలను ముద్రిస్తున్నారు. ఇకపై ఆ పత్రాలన్నింటిని సాఫ్ట్ కాపీల రూపంలో మంత్రులకు, సంబంధిత అధికారులకూ అందజేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల కోటా శాసన మండలి ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్లను ఈరోజు పరిశీలించనున్నారు. నిన్నటితో నామినేషన్ల గడువు ముగిసింది. కాగా ఈ ఉప ఎన్నికలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పోటీ చేస్తుండగా.. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ షఫీ ఉల్లా పోటీ చేస్తున్నారు. ఈనెల 16 వరకు ఉపసంహరణకు గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది.

మరోవైపు ఈ ఉపఎన్నికకు దూరంగా ఉండాలని ఎన్డీఏ కూటమి నిర్ణయించింది. ఈ నెల 30వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపఎన్నిక పోలింగ్ జరగనుంది.

---------------------------

తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విభజన సమయంలో కేటాయించిన 122 మంది నాన్‌గెజిటెడ్ ఉద్యోగులను తెలంగాణకు పంపాలన్న అభ్యర్థనపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రిలీవ్ అయ్యే వారు వారి కేడర్ చివరి ర్యాంక్‌లోనే విధుల్లో చేరతారని ఉత్తర్వుల్లో వెల్లడించింది.

=======================